1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | జూన్ 14, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎంపీపీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో గురువారం ఎంపీపీ రాథోడ్ సజన్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీతో కేక్ కట్ చేయించి ఇలాంటి పుట్టినరోజులు ఇంకెన్నో జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శివారెడ్డి, విడిసి చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటిసి డాక్టర్ జహీర్, వడూర్ ఎంపీటీసీ పండరి, నాయకులు జాదవ్ మహేందర్, రాథోడ్ సురేందర్, తేజాపూర్ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.



యథేచ్ఛగా ఆవుల రవాణా

దండేపల్లి : జగిత్యాల, మంచిర్యాల జిల్లా సరిహద్దులో గల మండలంలోని గూడెం చెక్‌పోస్ట్ ద్వారా ఆవుల రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఉదయం 3గంటల నుండి 5గంటల వరకు అక్రమంగా ఆవులను తరలిస్తున్నారని స్థానికులు తెలిపారు. పోలీసులు మాత్రం తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బక్రీద్ పండగను పురస్కరించుకొని అక్రమ రవాణా జరుగుతున్నట్లు భావిస్తున్నారు. ఆవుల రవాణాపై నిషేధమున్నా యథేచ్ఛగా కొనసాగుతుండడంతో ప్రజలు మండిపడుతున్నారు. గురువారం చెక్‌పోస్ట్ వద్ద సుమారు 20 ఎద్దులు, ఆవులను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ఆవులను గోశాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.



ఆరోగ్యవంతమైన పిల్లల కోసం
నులిపురుగులను నిర్మూలించాలి

- అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నిర్మూలిద్దామని, జిల్లాలో ఈ నెల 28న జరుగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పిల్లలందరికీ నులిపురుగు నివారణ కొరకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఎస్.అనిత, ప్రోగ్రామ్ అధికారి డా.నీరజ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఏడాది వయసు నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు అందించే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని 2లక్షల1వేయి143 మంది పిల్లలకు ఈ నెల 20న అల్బెండజోల్ మాత్రలు అందించేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. ఆ రోజు మాత్రలు అందని వారికి 27న మాప్ అప్ రౌండ్ ద్వారా అందించడం జరుగుతుందని, జిల్లాలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలలో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నులిపురుగులు ఉంటే పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనతతో అలసటతో ఉంటారని, శారీరక, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటారని తెలిపారు. మాత్ర వేసిన తరువాత పిల్లలో వికారం, స్వల్ప కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం వంటి లక్షణాలు రావచ్చని, ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అత్యవసర పరిస్థితులలో సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలలో ఉదయం ప్రార్థన సమయంలో అల్బెండజోల్ మాత్రలు, నులిపురుగుల నివారణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేయాలని పేర్కొన్నారు. రానున్న వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు, అంటు వ్యాధులు, విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రాలలో ప్రతిస్పందన బృందాలను ఏర్పాటు చేయాలని, ఆశా కార్యకర్తల వరకు ఎపిడమిక్ మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులలో డెంగ్యూ సంబంధిత వివరాలను జిల్లా ఎపిడమిక్ సెల్ నెం.9177847667లో సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం, జిల్లా సర్వేయలెన్స్ అధికారి డా.ఫయాజ్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లాలోని వైద్యాధికారులు, జిల్లా ఆసుపత్రి వైద్యులు, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాక్సింగ్ వేసవి శిక్షణ ముగింపు



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శ్రీరాంపూర్ ఏరియాలోని విశ్వశాంతి హైస్కూల్లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బోయిని రాజ్‌కుమార్ హాజరై క్రీడాకారులకు టీ షర్టు, సర్టిఫికెట్స్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో బాక్సింగ్ క్రీడా రోజురోజుకు అభివృద్ధి చెందుతోందని, ఈ ముగింపు కార్యక్రమానికి మంచిర్యాల, మందమర్రి, శ్రీరాంపూర్ నుంచి క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లాలో బాక్సింగ్ క్రీడని మరింత అభివృద్ధి చేయడానికి అసోసియేషన్ నుండి తన బాధ్యతగా అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో కూడా మన జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొనే విధంగా చూస్తామని, ప్రతి గ్రామానికి బాక్సింగ్ క్రీడా వెళ్లే విధంగా చూస్తామని తెలిపారు. సుమారుగా 45 రోజులుగా జరిగిన శిబిరంలో క్రీడాకారులు పాల్గొని మంచి నైపుణ్య క్రీడని నేర్చుకున్నారని అన్నారు. జిల్లా అసోసియేషన్ కార్యదర్శిని అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పాదం రవీందర్, సభ్యులు రాజు నాయక్ విశ్వశాంతి హైస్కూల్ కరస్పాండెంట్ రమేష్, సత్యనారాయణ, అశోక్, సాంబయ్య, కోచ్ జగత్ సాయి, సందీప్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ మిషన్ భగీరథ సర్వే పరిశీలన



నవతెలంగాణ-నేరడిగొండ

సవర్గాం గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను గురువారం ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. సర్వే ఏ విధంగా కొనసాగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లోపాలను తెలుసుకున్నారు. ఇంటింటికి ఇన్ని నల్లాలు ఉన్నాయా? ఎన్ని నల్లాలు పని చేస్తున్నాయా? అని తెలుసుకున్నారు. సర్వేను గడువులోగా పూర్తి చేయాలని సెక్రటరీ శ్రీదేవికి సూచించారు.

చితికిన బతుకులు..!

- గోడకూలి ముగ్గురు కూలీలు మృతి
- మంచిర్యాలలో విషాదం

నవతెలంగాణ-నస్పూర్

ప్రయివేట్ ఆస్పత్రి భవన నిర్మాణం చేపడుతుండగా ప్రహరీ గోడకూలి ముగ్గురు కూలీలు మృతి చెందిన సంఘటన మంచిర్యాలలోని బెల్లంపల్లి చౌరస్తాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలానికి చెందిన బాపురం శంకర్(42), ఎనంక హనుమంతు(45), గోలేం పోశం(60) భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం ఆస్పత్రి నిర్మాణ పనులు చేపడుతుండగా పక్కన ఉన్న ప్రహరీ గోడ ఒక్కసారిగా కూలి వారిపై పడడంతో ముగ్గురు కూలీలు అందులోనే ఇరుక్కుపోయారు. పోలీసులు, అధికారులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీసి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి కమిషనర్ శ్రీనివాస్ చేరుకొని పరిశీలించారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తామన్నారు. ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లనే ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బంధువుల రోదనలు మిన్నంటాయి.



మృతదేహాలను బయటకు తీస్తున్న దృశ్యం



ఘటనా స్థలానికి వచ్చిన రామగుండం సీపీ శ్రీనివాస్ ముందు బాధితుల రోదనలు



కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు

ఓసీ డంపుతో రోడ్లు కనుమరుగు

నవతెలంగాణ-జైపూర్

ఇందారం 1ఏ ఓపెన్‌కాస్ట్ గని ఓవర్ బర్డెన్(డంపు) కారణంగా రామారావుపేట్ గ్రామ పంచాయతికి సంబంధించిన రోడ్లు కనుమరుగవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు ఇందారం ఓసీ మరో వైపు శ్రీరాంపూర్ ఓసీ కారణంగా గ్రామ పంచాయతీ ఉనికి ప్రశ్నార్థకమయ్యే ప్రమాదముందని గతంలో పలుమార్లు సింగరేణి అధికారులను సర్పంచ్‌తో కలిసి విన్నవించారు. అయినప్పటికీ సింగరేణి అధికారుల్లో మార్పు కన్పించకపోవడంతో గురువారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లును కలిసి ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరిస్తూ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. రోడ్డుకు బదులుగా రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పిన అధికారులు ప్రత్యామ్నాయంగా రోడ్డు నిర్మించకుండా ఉన్న రోడ్డును తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో న్యాయం చేయాలని కోరారు. ఓపెన్‌కాస్ట్ గనుల ద్వార వెలువడుతున్న వాయు, శబ్ధ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఇప్పుడు వ్యవసాయ భూములకు రోడ్డు సౌకర్యం లేకుండా సింగరేణి అధికారులు కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు.

ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, ఇప్పటికే నిర్దేశిత లక్ష్యానికి చేరువలో ఉన్నామని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 286 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 24వేల532 మంది రైతుల వద్ద నుండి లక్షా56వేల116 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసి రూ.267కోట్ల53లక్షలు సంబంధిత రైతు ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు లక్షా56వేల116 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. లక్షా40వేల448 మెట్రిక్ టన్నుల ధాన్యం, 23వేల922 మంది రైతుల వివరాలు దాదాపు 90శాతం ట్యాబ్లలో నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

గణతంత్ర దినోత్సవం-2025 వేడుకలలో పద్మ అవార్డుల ప్రదానోత్సవం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని శాఖల పరిధిలో పద్మ అవార్డుల కొరకు నిర్ణీత నమూనాలో 800 పదాలకు మించకుండా ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కార్పొ'రేట్' బడులు..!

- తల్లిదండ్రులను హడలెత్తిస్తున్న ఫీజులు
- పాఠశాలల్లో కనిపించని ఫీజుల వివరాల పట్టికలు
- కొన్ని ప్రయివేటు విద్యా సంస్థల ఇష్టారాజ్యం
- పర్యవేక్షణ..పట్టింపు మరిచిన విద్యాశాఖ అధికారులు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 200బడులు

ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు సరిపడా సబ్జెక్టు బోధకులు ఉండరనే కారణంగా అనేక మంది తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు ఆర్థికంగా ఎంత కష్టమైనా పిల్లలను బాగా చదివించాలనే తపనతో కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో సరైన సౌకర్యాలు ఉండవనే ప్రచారం అనేక మంది తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించడం లేదు. ఇదే అదనుగా భావిస్తున్న కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల రూపంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఫీజు నియంత్రణ కమిటీలు ఏర్పాటుచేయకుండా.. పాఠశాలల్లో ఫీజుల వివరాల పట్టిక పెట్టకుండా యదేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. కానీ విద్యాశాఖ అధికారులు వీటిని నియంత్రించడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు సుమారు 200వరకు ఉండగా..కొన్ని మినహాయించి అనేక పాఠశాలలు ఫీజుల మోతమోగిస్తున్నాయి.

చిరుద్యోగం చేసే ఓ తండ్రి ఎంత కష్టపడైనా తన కొడుకును బాగా చదివించాలనే ఉద్దేశంతో కార్పొరేట్ పాఠశాలను సందర్శించారు. ఏడో తరగతిలో ప్రవేశం కోసం సదరు యాజమాన్యాన్ని సంప్రదించారు. ఏడాదిలో పాఠశాల ఫీజు రూ.45వేలు, హాస్టల్ వసతి కోసం మరో రూ.50వేల వరకు ఖర్చు అవుతుందని సదరు యాజమాన్యం చెప్పడంతో అవాక్కయ్యారు. కానీ కొడును మంచి కార్పొరేట్ స్కూల్‌ల్లో చదివించాలనే తపనతో గత్యంతరం లేక సదరు పాఠశాలలో చేర్పించారు. మరికొందరు తల్లిదండ్రులది కూడా ఇదే పరిస్థితి. కానీ ఇలా కొన్ని కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అందరికీ విద్య అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సర్కారు బడులను నెలకొల్పింది. వీటిలో అన్ని సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించింది. ఇటీవల ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టినా..సరిపడినంత బోధకులు లేరు. మరోపక్క సౌకర్యాల లేమి కూడా అవరోధంగా మారుతోంది. ఇదే అదనుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక ప్రయివేటు పాఠశాలలు ఏర్పడుతున్నాయి. ఐదేండ్ల క్రితం వరకు ప్రయివేటు పాఠశాలలు నెలకొల్పుతుండగా.. కొత్తగా కార్పొరేట్ బడులు సైతం అవతరిస్తున్నాయి. హైదరాబాదు వంటి నగరాల్లో కనిపించే ఈ బడులు తాజాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ బ్రాంచీలను ఏర్పాటుచేశాయి. కొన్ని కార్పొరేట్ బడులు విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాల స్థాయిలోనే ఎంసెట్, నీట్, ఐఐటీ వంటి కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తామని చెబుతూ ఫీజులు నిర్ణయించగా.. మరికొన్నింటిలో మాత్రం అరకొర సౌకర్యాలు కల్పిస్తున్నా.. భారీగా ఫీజులు నిర్ణయిస్తున్నాయి. వీటిని చూసి అనేక మంది తల్లిదండ్రులు అసంతృప్తికి గురవుతున్నారు. తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకుంటున్న కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు భారీగా ఫీజులు నిర్ణయించడం పట్ల ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం చదువుకోవడం కాకుండా.. చదువును కొనడంగా మారిందనే భావన వ్యక్తమవుతున్నట్లు చెబుతున్నారు.

కనిపించని ఫీజుల పట్టికలు..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 200వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో తప్పనిసరిగా ఫీజుల నియంత్రణ పాటించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. వాటిల్లో చదివే తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి ఫీజులను నిర్ణయించాల్సి ఉంటుంది. ఏ తరగతికి ఎంత ఫీజు తీసుకుంటున్నారో.. వాటి వివరాలను పాఠశాలలో పట్టిక రూపంలో ప్రదర్శించాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధనలు కొన్ని పాఠశాలలు పట్టించుకోవడం లేదు. ఫీజు నియంత్రణ కమిటీలతో సంబంధం లేకుండా ఇష్టారీతిన వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని పాఠశాలల్లో ఒకటో తరగతికే రూ.25వేల నుంచి రూ.30వేల వరకు తీసుకుంటుండగా.. ఆ పై తరగతులకు వెళ్లే కొద్దీ ఫీజు మరింత పెంచుతూ తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి.. అధిక ఫీజులను నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ వ్యవహారాన్ని మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశువుల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి అంశాలపై ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా చట్ట విరుద్ధమని, అక్రమంగా పశువులను రవాణా చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. 14 సంవత్సరాలు నిండని పశువులను ఎట్టి పరిస్థితుల్లో రవాణా చేయకూడదని, సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ అనుమతి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. జిల్లాలో పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దులతో సహా మొత్తం 27 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. చెక్ పోస్టుల వద్ద నిరంతరం పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేశామన్నారు. రానున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల రవాణా పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి

జిల్లాల్లో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా ఏరియా ఆసుపత్రిలో డ్రగ్స్ డీ అడిక్షన్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీసు, ఎక్సైజ్ అధికారులు మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా పెంచాలన్నారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్యం నుంచే పిల్లలకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎస్పీ గంగారెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, జెడ్పీ సీఈవో గోవింద్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | జూన్ 14, 2024 | www.navatelangana.com

విద్యార్థినికి ఘన సన్మానం

నవతెలంగాణ-ఇచ్చోడ



మండలం కేంద్రంలోని సన్‌షైన్ స్కూల్‌లో 5వ తరగతి చదివిన మహన్య నవోదయ, సైనిక్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాయగా, ఆ పరీక్ష ఫలితాల్లో మహన్య నవోదయ, సైనిక్ స్కూల్ రెండింటిలోనూ ఉత్తమ మార్కులతో సీటు సాధించారు. దీంతో సన్‌షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థినిని ఘనంగా సన్మానించి, మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ నవోదయ, సైనిక్ పాఠశాలల ప్రవేశానికి తీవ్ర పోటీ ఉన్నపటికీ రెండింటిలోనూ సీటు సాధించడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యజమాన్యం రాకేష్, గణేష్, సంజయ్, ఉపాధ్యాయులు నడిపెన్న, సాహితీ, చందన పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని కన్నపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రధానోపాధ్యాయులు రమేష్ ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులతో కలిసి జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను భోదించడం జరుగుతుందన్నారు. బడీడు కలిగిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, అంగన్‌వాడీ టీచర్ ప్రభ, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశాలకు నష్టం కలిగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



ఆదిలాబాద్‌టౌన్



నిర్మల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశాలకు నష్టం కలిగించే, పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 సంవత్సరాలు, మైదాన ప్రాంతంలో గత 19 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని అన్నారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారని, రిజిస్టర్ రాయడం సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తున్నారని వీటితో పాటు గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలు, ఇతరప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని తెలిపారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డులను కూడా ప్రకటించిందని అన్నారు. అన్ని పనులను నిర్వహిస్తూ ఇంత సీనియారిటీ ఉన్న ఆశ వర్కర్లకు కొత్తగా ఎగ్జామ్స్ నిర్వహించి, కొత్తగా ఆశాల జ్ఞావకశక్తిని మళ్లీ నిరూపించుకోవాలని చెప్పడం సమంజసం కాదని అన్నారు. వెంటనే పరీక్షల నిర్వహణ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆశాలకు పని భారం తగ్గించాలని, జాబ్ కార్డు ఇవ్వాలని, కనీస నిర్ణిత వేతనం రూ.26వేలు రూ. చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ రూ.50లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతినెల 2వ తేదీన వేతనాలు చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి నైతం శోభ, ఏం.సుజాత, ఆశా నాయకులు గంగమ్మ ఆశ, అర్చన, లక్ష్మి, కాంత, పుష్పలత, రుక్మిణి, పుష్ప, సురేఖ, లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

నిర్మల్ : ఆశాలకు నష్టం కలిగించే, పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆశాల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 సంవత్సరాలు, మైదాన ప్రాంతంలో గత 19 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని అన్నారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక శిక్షణలు పొందారన్నారు. రిజిస్టర్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ ఇతర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. వెంటనే పరీక్షల నిర్వహణ ఆలోచనను వెంటనే విరమించుకోవాలన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ రూ.50లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతినెలా 2న వేతనాలు చెల్లించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సమస్యలు పరిష్కరించని యెడల ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గంగామణి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుజాత, అధ్యక్షులు చంద్రకళ, ఉపాధ్యక్షులు విజయ, ఇంద్రమల, అనసూర్య, కోశాధికారి రామలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శిలు మంజుల, మౌనిక, రాధా, సుగ్న, సులోచన, కమల, సరిత పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

- చెట్టుకింద విద్యార్థులకు పాఠాలు





నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని పరస్‌వాడ(కె) పరిధిలోని ధర్మగూడలోని ఐటీడీఏ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. భయంతో గురువారం ఉపాధ్యాయ సిబ్బంది చెట్టు కింద విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో పరిస్థితి ఏంటని గ్రామస్తులు వాపోతున్నారు. గత ఏడాది ఐటీడీఏ అధికారులను పాఠశాల భవనం గురించి వివరించగా, పనులు ప్రారంభించలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అమ్మఆదర్శ పాఠశాల కింద పనులు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ముధోల్

ఈనెల 25న జరిగే అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్‌బీ 74వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఏఐఎస్‌బీ ముధోల్ నియోజకవర్గం ఇన్‌చార్జీ వాగ్మారే అమూల్ కోరారు. గురువారం సంబంధిత వార్షికోత్సవాల పోస్టర్లను ముధోల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఐఎస్‌బీ 1951లో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకై కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సోషలిజం సాధనకై కృషి చేశారని అన్నారు. నేతాజీ కలలు కన్నా భారత దేశ పునర్‌నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమిస్తుందని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వ విద్యా సంస్థల యూనివర్సిటీల పరిరక్షణకు విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా గత 73 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 74వ వార్షికోత్సవాలను ఏఐఎస్‌బీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గం నాయకులు దిలీప్, అజయ్ పాల్గొన్నారు.

రైతులు తొందరపడొద్దు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రైతులు తొందరపడి వర్షం పడకముందే విత్తనాలు వేయొద్దని నేల పూర్తిగా తడిచిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలని ఏఓ ప్రమోద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించారు. విత్తనాల, ఎరువుల, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకొని, వర్షంతో నేల పూర్తిగా తడిసిన తర్వాతనే విత్తుకోవాలని సూచించారు. తేలికపాటి వర్షానికి విత్తనాలు ఎత్తుకోవడం వల్ల రైతులు నష్టపోవడం జరుగుతుందని, ఒకటి రెండు భారీ వర్షాలు కురిసిన తర్వాత నేల పూర్తిగా తడిసిన వెంటనే విత్తనాలు విత్తుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంతోష్, ఫర్టిలైజర్ దుకాణ యజమానులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

- మహిళను చంపి రోడ్డుపై పడేశారు..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షిద్‌నగర్ ప్రాంతంలోని మమత జిన్నింగ్ మిల్ వద్ద రోడ్డు ప్రక్కన గాయాలతో ఒక మహిళ మృతదేహం లభించింది. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయమై డీఎస్పీ జీవన్‌రెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. మహిళ దాదాపు 30 సంవత్సరాల వయసు ఉంటుంది. ఆనవాళ్లు శరీరం ఎరుపు రంగుతో ఉండి, గులాబీ రంగు చీర, జాకెట్ ధరించి ఉందని తెలియజేశారు. మహిళను ఎక్కడో గాయపరిచి, చంపి పడేసినట్టు డీఎస్పీ వెల్లడించారు. మహిళ ముఖంపై, ఒంటిపై గాయాలు ఉండటంతో ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు, దర్యాప్తు జరుగుతున్నట్టు తెలియజేశారు. ఈ విషయంపై సంబంధికులు, ప్రజలు ఎవరికైనా మహిళ పట్ల సమాచారం తెలిస్తే డీఎస్పీ జీవన్‌రెడ్డి 8712659914, రెండో పట్టణ సీఐ అశోక్ 8712659920 నెంబరును సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం మహిళ మృతదేహం రిమ్స్‌లో ఉందని తెలిపారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓపెన్ స్కూల్ దూర విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 25 నుంచి మే 5వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేడు విడుదలైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాల కోసం ఈ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్జీలో చూడవచ్చని పేర్కొన్నారు. మెమోలో ఏవేని పొరపాట్లు ఉన్నచో సంబంధిత అధ్యయన కేంద్రాల ప్రధానోపాధ్యాయుల, ఏఐకో- ఆర్డినేటర్ల ద్వారా 15 రోజులలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పొగాకు విక్రయించినా సరఫరా చేసినా చర్యలు



- ఒకరు అరెస్ట్, ఇద్దరు పరారీలో
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పొగాకు విక్రయించిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు.గురువారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. జిల్లాలో రూ 3లక్షల 15వేల 150 విలువ గల నిషేదిత పొగాగు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ కేసులో ఒకరిని అరెస్ట్ చేయగా, ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. బుధవారం రాత్రి ఆదర్శనగర్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో ఇల్లు కిరాయికి తీసుకొని నిషేదిత పొగాకును ప్రజలకు అమ్మాలనే ఉద్దేశంతో నిలువ ఉంచగా స్వాధీనం చేసుకొని, నిందితున్ని పట్టుకున్నామని తెలియజేశారు. ఏ1 షేక్ అఫ్సర్‌ను అరెస్ట్ చేశామని, అక్రం, మన్సూర్ ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుడు డబ్బు మీద అత్యాశ, పరిస్థితుల ప్రభావం ద్వారా, ప్రభుత్వం నిషేధించినందున పొగాకును అమ్మి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పొగాకును కొనుగోలు చేసి, ప్రజలకు ఎక్కువ ధరకు అమ్ముతూ లాభం పొందుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆదర్శనగర్‌లో ఇల్లు కిరాయికి తీసుకొని నిల్వ ఉంచినట్లు తెలిపారు. మావల సబ్ ఇన్స్‌పెక్టర్‌కు అందిన సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ సిబ్బందితో తనిఖీ చేయగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. మొత్తం నిషేదిత పొగాకు విలువ రూ.3లక్షల 15వేల 150 ఉంటుందని, ఈ నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు. పొగాకును అక్రమంగా సరఫరా, అమ్మకం చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఎటువంటి సమాచారం అయినా జిల్లా ఉన్నతాధికారులకు కానీ, డయల్ 100 ద్వారా కానీ సమాచారాన్ని అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు. సమావేశంలో రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్, మావల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోడు రైతులను అటవీ అధికారులు ఇబ్బంది పెట్టొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని పోడు భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామపంచాయతీ పరిధిలోని సిరికొండ గ్రామంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని తెలుసుకుని, సాగు భూములను పరిశీలించారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసుల భూముల్లో మొక్కలు నాటడానికి జేసీబీతో తవ్వుతున్న గుంతలను ఆపాలని అటవీ అధికారులకు సూచించారు. ఆదివాసులమీద అటవీ అధికారుల ప్రతాపం చూపటం ఏంటని మండిపడ్డారు. ఇక్కడి ఆదివాసుల 15 సంవత్సరాలుగా పోడు భూములు చేసుకుంటున్నారని, ఇప్పుడు మొక్కలు నాటితే వారి బతుకులు ఏం కావాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని పై అధికారులకు ఫోన్లో తెలపడంతో ఎట్టకేలకు అధికారులు జేసీబీని తిరిగి పంపించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ ఆదివాసులపై అటవీ అధికారుల దౌర్జన్యాన్ని ఆపాలని అన్నారు. ఇక నుంచి కొత్త భూమిని కొట్టనీయమని, పాత భూమిలో అటవీ అధికారులకు రానియమని అన్నారు. అమాయక ఆదివాసుల మీద అటవీ అధికారుల పెత్తనాన్ని సహించేది లేదని తెలిపారు. ఏ సమస్య ఉన్న గ్రామ ప్రజల సమక్షంలో కమిటీలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలి తప్ప.. సమస్యని జటిలం చేసుకోవడం మంచి పద్ధతి కాదని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తుందని, ప్రజలకు అనుకూలంగా అధికారులు, నాయకులు సహకరించాలని అన్నారు. ఎన్నో ఏండ్లుగా అడవిని పోడు చేసుకుని సాగు చేసుకుంటున్న రైతులకు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా చైర్మెన్ సెడ్మాకి ఆనంద్‌రావు, నాయకులు కోరెడ్డి కిషన్, సుధాకర్ గౌడ్, మల్లన్న, సోమన్న, గంగారాం, బాపురావు, జాకూ, కిషన్ పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలు కేటాయించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

టీజేఏ కార్యాలయం, ఇండ్ల స్థలాలు కేటాయించాలని ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు రాథోడ్ అజయ్ అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పీఓ మాట్లాడుతూ తప్పకుండా ట్రైబల్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అందరూ కలిసి కట్టుగా ముందుకు సాగితే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. టీజేఏ డివిజన్ అధ్యక్షులు అజయ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తూ అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కారం అయ్యేవిధంగా మాట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ తరుపున సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. టీజేఏ కార్యాలయం కోసం, ఇండ్ల స్థలాల కోసం తమకు స్థలాలు కేటాయించి, అక్రిడిటేషన్ రాష్ట్ర కమిటీలో ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇద్దరికీ చోటు కల్పించాలని కోరారు. ఇందులో



ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ ఉట్నూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి భీంరావ్, ఉపాధ్యక్షులు చవాన్ సేవాదాస్, కోశాధికారి ఉన్నారు.

ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పారామెడికల్, చదువుతున్న ఎస్సీ, బీసీ విద్యార్థుల నుంచి వసతి గృహంలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని వార్డెన్ శ్రావణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ విద్యార్థులకు 63, ఎస్సీ విద్యార్థులకు 07, ఈబీసీలకు 05 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బీసీహస్టల్.సీజీజీ.గావ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9963160608 నెంబర్‌లకు సంప్రదించాలని సూచించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన తెలుగు పండిత్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజానంద్‌ను రాళ్లతో మోది హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని బంజారా యువ సేన మండల అధ్యక్షుడు జాదవ్ దత్త గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయుడి హత్యకు కారణమైన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు.

15 నుంచి స్పాట్ అడ్మిషన్స్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ (పురుషుల) డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఫోటో, ఆధార్ కార్డుతో పాటు రెండు సెట్స్ జిరాక్స్ తీసుకురావాలని పేర్కొన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఐఎఎస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

హైదారాబాద్ రాజేందర్‌నగర్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు గిరిజన ఐఎఎస్ స్టడీ సర్కిల్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారి వార్షిక ఆదాయం రూ.3లక్షలు మించకూడదని, జూన్ 13 నుంచి 30 తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని కోరారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎస్సై శ్రీకాంత్

నవతెలంగాణ-సారంగాపూర్



బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు.గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల ముస్లిం కమ్యూనిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎటువంటి సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో రాబోయే బక్రీద్ పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన

నవతెలంగాణ-కౌటాల



సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలు, సఖి కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని వీర్దండి, విజయనగరం, పటేల్ గూడ, తాటిపెల్లి గ్రామాలలో గృహ హింస, వరకట్న వేధింపులకు గురైతే 181 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సఖీ కేంద్రంకు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాలు చేయొద్దని, అలా చేసిన వారి గురించి సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళల హక్కులను కాలరాస్తే కటిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది పవిత్ర, జానాబాయి, రఘు, వినయ్ పాల్గొన్నారు.

ఈసీ ఆపరేటర్లకు ప్రాక్టికల్ పరీక్ష

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓసీపీలో బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల కోసం ప్రాక్టికల్ పరీక్షలను గురువారం నిర్వహించారు. బి గ్రేడ్ నుండి ఏ గ్రేడ్ పదోన్నతి కోసం 22 మంది ఈపీ ఆపరేటర్లు పరీక్షలకు హాజరయ్యారు. అధికారులు వీరికి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ ఓ టూ జీఎం ఉమాకాంత్, ఫిట్ ఇంజనీర్ వీరన్న, కార్పొరేటర్ మెంబర్ శ్యాంసుందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఇంజనీర్లు మహేశ్వర్ కురేపి పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారులకు సహకరించాలి

- కాగజ్‌గనర్ ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ అప్పలకొండ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కొన్ని సంవత్సరాల నుండి సిర్పూర్ రేంజ్ అటవీ పరిధిలో ఉన్న ఇటిక్యాల్ పహాడ్ గ్రామస్తులు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారని, ఈ సంవత్సరం 200 హెక్టార్లలో మొక్కలు నాటాలని లక్ష్యం ఇచ్చారని కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ అప్పలకొండ అన్నారు. గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. గురువారం ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి గ్రామస్తులతో చర్చలు నిర్వహించారు. ఉన్నత అధికారులు, ప్రభుత్వ నిర్ణయాన్ని ఎఫ్‌డీఓ వారికి వివరించారు. ప్రతి కుటుంబానికి ఆడ ప్రాజెక్టు నిర్వాసితులకు రెండు ఎకరాలు స్థానికంగా ఉండే కుటుంబాలకు మూడెకరాలు ఇవ్వాలని అలాగే మొక్కలు నాటే ప్లాంటేషన్‌లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని నిర్ణయించినట్లు దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ప్రతి సంవత్సరం అధికారులు ఇలాగే చెప్తూ మాకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపడం లేదని రైతులు అన్నారు. కుటుంబానికి 5 ఎకరాల భూమి ఇవ్వాలని, శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు.

ఇంటి రుణంపై వడ్డీ చెల్లింపు ఆంక్షలు ఎత్తివేత

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో కార్మికుల ఇంటి రుణంపై వడ్డీ చెల్లింపులో గతంలో ఉన్న ఆంక్షలను ఎత్తివేసేందుకు యాజమాన్యం అంగీకరిస్తూ సర్క్యులర్ జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జడ్పీటీసీ వేమూర్ల సంతోష్ కోరారు. గురువారం కలెక్టర్ వేంకటేష్ ధోత్రేను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని, హెల్త్ సబ్ సెంటర్‌ను ప్రారంభించాలని కోరారు. అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పైకాజీగూడ, రాంపూర్, పులికుంట, గొండుగూడ రోడ్లకు కంకర పోసి వదిలేశారని ఆరోపించారు. కొండపల్లి గ్రామానికి నూతన బీటీ రోడ్డు మంజూరు చేయాలన్నారు. మండలంలో అనేక సమస్యలున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే సమస్యలను ఆయా శాఖల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని కౌటాల మండలం డబ్బా ఎక్స్ రోడ్డు ధరంపల్లి ముంపు గ్రామం వద్ద కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన వ్యక్తులు మాలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 168, 169లలో ఉన్న ప్రభుత్వ భూమిలో గతంలో జ్యోతిబాపూలే విగ్రహం నిర్మించామన్నారు. ప్రస్తుతం కమ్యూనిటీ హాల్‌కు ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని ఇదే విషయం కలెక్టర్‌కు వివరించామన్నారు. ఈ విషయంపై కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, గ్రామస్తులు ధనుంజయ్, శంకర్, శైలజ, ఆనందరావు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

- ఆదర్శంగా నిలుస్తున్న జిల్లా వాసులు
- నేడు ప్రపంచ రక్త దాతలు దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎదైన ప్రమాదం జరిగినప్పుడు రక్తస్రావం అవుతుంది. ఆ సమయంలో వారు కోలుకోవాలంటే రక్తం కావాలి. కానీ కొంత మంది రక్తదానం చేస్తే నీరసం వస్తుందనే భయంతో ముందుకు రావడం లేదు. వీరి రక్తదానంతో ఒక ప్రాణం నిలబడుతుంది. రక్తదానం చేసే వాళ్లంటునే అత్యవసర పరిస్థితుల్లో ఇంకొకరి ప్రాణం కాపాడొచ్చు. ఇదే క్రమంఠ అనేక మంది యువత రక్తదానం చేయడానికి ముందుకు వస్తున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా వారి గురించి..

ఇది చరిత్ర

రక్తదానం చేసే వారిని ప్రోత్సహించేల ప్రతి ఏట జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటారు. దీనికి ముందుగా 1901లో ఆస్ట్రేలియాకు చెందిన నోబెల్ విజేత కార్ల్ లాండ్‌స్టీనర్ మొదటిసారిగా రక్తాన్ని వర్గీకరించారు. దీంతో ఆయన జయంతి గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని 2004లో అన్ని దేశాల్లో నిర్వహించారు. రక్తదానం చేస్తే బలహీనపడి, నీరసించిపోతారు అనేది ఒక అపోహ ఉంది. కానీ రక్తదానం తర్వాత ఎటువంటి బలహీనత సంభవించదు. ఎప్పటిలా ఆరోగ్యంగా ఉంటారు. శ్రమతో కూడిన కష్టమైన పనులు చేసుకునేవారు ఇంతకుముందులా పనిచేసుకోలేరనే భయం కూడా ఉంది.

32 సార్లు రక్తదానం చేశా

ఎండి.మొయినుద్దీన్, స్థానికుడు



ఇప్పటివరకు 32 సార్లు రక్తదానం చేశా. 12 సంవత్సరాల నుండి రక్తదానంపై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛంద సంస్థ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించాను. ప్రతి వ్యక్తి రక్తదానం చేయాలి.

రక్తదానంతో ఆరోగ్యం మెరుగవుతుంది

వైరగడే ప్రతాప్, స్థానికుడు



రక్తదానం చేయడంతో ఆరోగ్యం గతంలో కంటే మెరుగవుతుంది. ఇప్పటి వరకు 36సార్లు రక్తం ఇచ్చాను. ఈ సంఖ్యను 100కు చేర్చడానికి కృషి చేస్తున్నాను. ఇతరులకు అవగాహన కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాను.



రక్తదానం తర్వాత యధావిధిగా అన్నిరకాల శ్రమతో కూడిన పనులు చక్కగా చేసుకోవచ్చు.

రక్తదానం ఆరోగ్యానికి మంచిదే

రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదేనని వైద్యులు తెలుపుతున్నారు. రక్తదానం చేసే సమయంలో ఇతర వ్యాధులు సోకుతాయని ఉన్న అపోహని వైద్యులు ఖండిస్తున్నారు. రక్తదానం చేయడం చాలా మంచిదని, శరీరంలోని అవయవాలు పనిచేయడంతో పాటు రక్తం శుద్ధి జరుగుతుందని తెలుపుతున్నారు.

ఆదర్శంగా నిలుస్తున్న జిల్లా వాసులు

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని భావించేవారు అనేకమంది ఉన్నప్పటికీ చేయడానికి ముందుకు వచ్చేవరకు కొంతమంది ఉంటారు. అపద సమయంలో తాము ఉన్నమనే భరోసా కల్పించేల జిల్లాకు చెందిన యువత అనేకమంది రక్తదానం క్యాంపు నిర్వహించినప్పుడు రక్తదానానికి ముందుకు వస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి శిబిరంలో తప్పనిసరిగా 20 నుండి 50 యూనిట్లు సేకరిస్తున్నారు.

ప్రాణహిత కాలువలను పరిశీలించిన రిటైర్డ్ ఇంజనీర్లు



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని కమ్మర్పల్లి శివారు నుండి వెళ్తున్న ప్రాణహిత ప్రాజెక్టు ప్రధాన కాలువను గురువారం హైదరాబాద్ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలసి పరిశీలించారు. తుమ్మిడిహెట్టి వద్ద సందర్శించినంతరం మండలంలోని ప్రధాన కాలువలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఈఈ పాత వెంకటరమణ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ ఆనకట్ట కూలిపోవటంతో ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజ్ నిర్మించడమే శరణ్యమని తెలిపారు. వెంటనే ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కాలువలను పరిశీలించిన బృందంతో సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడల్లా ప్రాజెక్టు సైట్లను మార్చి తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఉత్తర తెలంగాణకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా ఉన్న తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని, ఎల్లంపల్లి వరకు గ్రావిటీ ద్వారా నీటిని తరలించాలన్నారు. ఎల్లంపల్లి నుంచి దిగువన నిర్మించిన రిజర్వాయర్లన్నీ నింపుకోవచ్చని దక్షిణ తెలంగాణ వరకు నీటిని తరలించుకోవచ్చని తెలిపారు. త్వరలోనే రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ భీమయ్య, పుల్లారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ రిటైర్డ్ రఘుమా రెడ్డి, వెంకటయ్య, రిటైర్డ్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ హన్మంత్ రెడి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పశువుల అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ- సిర్పూర్(టి)

పశువులను సంబంధిత శాఖ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా తరలించిన, రవాణాకు ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేష్ హెచ్చరించారు. బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకొని పశువుల అక్రమ రవాణా నివారించడానికి ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర నుండి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సిర్పూర్-టీ గ్రామ శివారు ప్రాంతాల్లో పశువుల లారీని పట్టుకున్నారు. అందులో తనిఖీ చేయగా 38 పశువులున్నట్లు తెలిపారు. సిమెంట్ లారీ అని చెప్పే ప్రయత్నం చేశారని, తనిఖీ చేయగా అందులో పశువులున్నాయన్నారు. పట్టుబడిన పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించి షేక్ జమీల్, షేక్ అర్బాజ్, మొహమ్మద్ షేక్ జైనుద్దీన్‌లపై కేసులు నమోదు చేశామన్నారు.

పరీక్ష నిర్వహించే విధానం రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆశ వర్కర్లకు సమర్థ్యాన్ని తెలుసుకోవడానికి ప్రభుత్వం పరీక్ష నిర్వహించాలన్న ఆలోచనను విరామించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆశ వర్కర్లు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పరీక్ష పెట్టే విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చెల్లిస్తున్నట్లు కనీస వేతనం రూ.10000 చెల్లించాలని కోరారు. కనీస వేతనం పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. పని భారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు స్వరూప, ప్రధాన కార్యదర్శి, నగరం పద్మ, నాయకులు ఓమలా, కేసరా నవీన, రాజేశ్వరీ, రంభా, సక్రుబాయి, సునీత, బద్రుబాయి, అరుణా, కవితా, నిర్మలా సుమలత, భాగ్య పాల్గొన్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేసేలా చూడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేసేలా చూడాలని ఒకవేళ అమలు చేయకుంటే వాటిని ఎం ప్యానెల్‌లో ఉంచకూడదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు నియమిస్తున్న సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయకపోవడంతో అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలా అమలు చేయని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని ఎం ప్యానెల్ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ పాల్గొన్నారు.

కురిసేదెంత..నిలిసేదెంత

- అరకొరగా ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు
- బీమాపైన ప్రభావం చూపుతున్న నివేదికలు
- పరిహారం అందక నష్టపోతున్న రైతులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షపాతాన్ని అంచనా వేయడంలో వర్షపాత నమోదు ప్రక్రియ కీలకం. కరువును అంచనా వేయడం అతివృష్టి అనావృష్టి తీవ్రతను తెలియజేప్పడంలో రోజువారి నమోదు ప్రక్రియలే ప్రధానం. ఏ మాత్రం తప్పుచేసిన రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందే సాయంలో కోతపడే అవకాశం ఉంది. ఆయా మండలాలలో కురిసే వర్షపాతం నమోద కోసం కాలం చెల్లిన రేయిన్ గేజిలపైన అధికారులు ఆధారపడుతున్నారు. వర్షపాత నమోదు పర్యవేక్షించాల్సిన సహాయ గణాంక అధికారుల నిర్లక్ష్యం కారణంగా చినుకల లెక్కల్లో శాస్త్రీయత కోరవడుతోంది. ఇంకా పురాతన పద్ధతుల్లోనే గణాంకాలు నమోదుచేయడం వలన నివేదికలు తప్పుల తడకగా తయారయ్యాయి. జిల్లాలో అన్ని మండలాలలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్‌ల ద్వారా వర్షపాతాన్ని నమోదు చేస్తున్నప్పటికి ఇవి పెద్దగా సత్ఫలితాలు ఇవ్వడం లేదనే భావనుంది. జిల్లాలో మొత్తం 15 మండలాలుండగా కేవలం 12 మండలాలలోనే రెయిన్ గేజ్‌లున్నాయి. వీటి నిర్వహణను తెలంగాణా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీఎస్డీపీఎస్) చూస్తున్నది. ఈ సందర్భంలో వాతావరణ లెక్కలపైన జిల్లాలో పడే ప్రభావంపైన ప్రత్యేక కథనం.

తప్పుల తడకగా నివేదికలు

వర్షపు చినుకుల లెక్కల్లో శాస్త్రీయత కొరవడుతోంది. పురాతన పద్ధతుల్లో వర్షపాతాన్ని లెక్కకట్టడం వల్ల నివేదికలు తప్పుల తడకగా మారి తీవ్ర సమస్యలు తలెత్తున్నాయి. ఏటా కురుస్తున్న వర్షపాతం ఆధారంగానే కరువు అంచనా, వ్యవసాయ ప్రణాళికలు, పంట బీమా చెల్లింపులు జరుగుతాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న వర్షపాతం నమోదులో ఇప్పటికి ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రాకపోవడంతో అధికారుల అంచనాలు తారుమారవుతున్నాయి.

- వర్షపాత నమోదులో లోపించిన శాస్త్రీయత



కరువు అంచనాలలో ఇబ్బందులు

ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానం ప్రకారం ఒక వర్షపు రోజు నుండి మరొక వర్షపు రోజుకు మధ్య 15 రోజుల వ్యత్యాసం ఉంటేనే ఈ ప్రాంతంలో కరువు ప్రభావం ఉన్నట్లుగా అధికారులు పరిగణిస్తారు. అంటే 25 మీమీపైన కురిసిన వర్షపాతాన్ని ఒక రోజుగా గుర్తిస్తారు. ఇంతగా ప్రాధాన్యత గల వర్షపాత నమోదుపైన అధికారుల నిర్లక్ష్యంపైన సర్వత్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. అసలు వర్షపాతం అంచనాలే తలకిందులు కావడంతో కరువు ప్రాంతాల ఎంపిక ప్రక్రియ కూడా అశాస్త్రీయంగా ఉండడం వల్ల ప్రభుత్వ సాయం కూడా కరువవుతున్నది.

మండల కేంద్రాలకే పరిమితం

జిల్లాలో ఒక్కో మండలం సుమారుగా 20 నుండి 30 కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. కేవలం మండల కేంద్రాలలోనే వర్షపాత సూచికలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామాల్లో కురిసిన వర్షం లెక్కలోకి రావడం లేదు. అలాగే వీటి నిర్వహణ లెక్కింపు బాధ్యత మండల గణాంక అధికారులకు ఇవ్వడం కొన్ని మండలాలకు అధికారులు అందుబాటులో లేకపోవడం తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే కింది స్థాయి సిబ్బందే వర్షపాతాన్ని లెక్కకడుతున్నారు. క్షేత్రస్థాయి అధికారుల లెక్కలతోనే ఉన్నత స్థాయి అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు.

పంట బీమాపైన ప్రభావం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పంటల భీమా పథకాల్లో ప్రీమియం చెల్లిస్తున్న రైతులకు పంట నష్టాన్ని అందించే అవకాశం ఉంటుంది. పలు బీమా కంపెనీలు వాతావరణ స్టేషన్ల ఆధారంగానే బీమా చెల్లింపులు చేసేందుకే ఆసక్తి చూపుతున్నాయి. అవి అందించే వివరాలను, రెవెన్యూ అధికారులు సేకరించి సమాచారానికి ఎలాంటి పొంతన లేకుండా పోతోంది.

వర్షపాత నమోదులో చేయాల్సిన మార్పులు

రైతులకు సరైన న్యాయం జరిగి సరైన వర్షపాతం నమోదు కావాలంటే సబ్ స్టేషన్లలో మార్పుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాత వాటి స్థానంలో ఆటోమేటిక్ యంత్రాలను ఏర్పాటుచేసి వీటిల్లో చిప్ ఏర్పాటు చేయడం వల్ల వర్షపాతం, వాయువేగం, ఎండ తదితర వివరాలతో కూడిన వాతావరణ నివేదికను అధికారులకు ప్రతి గంటకు ఒకసారి తెలిపే పరికరాన్ని ఏర్పాటు చేయాలి. ఇదే సందర్భంలో ఈ నివేదిక ప్రణాళిక సంస్థ ప్రధాన సర్వర్‌కు అనుసందానించడం వల్ల వర్షపాత నమోదులో సరైన నివేదికలు వచ్చి రైతులకు న్యాయం కలిగే అవకాశం ఉంటుంది.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-తాండూర్



ముస్లింలు బక్రీద్ పండుగను శాంతిభద్రతల నడుమ ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ కుమారస్వామి సూచించారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత ఏర్పాట్లను చేశామన్నారు. ముస్లింలు పోలీస్‌ల సూచనలు, కట్టుబాట్లకు లోబడి పండుగను సాంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని సూచించారు. పండగ నేపథ్యంలో సర్కిల్ పరిధిలో పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ తిరుగుతారన్నారు. కార్యక్రమంలో ఆయ మతల పెద్దలు, పోలీసులు పాల్గొన్నారు.

15న మందపల్లి పశువుల సంతకు వేలం

నవతెలంగాణ-జన్నారం

ఈనెల 15న మందపల్లి గ్రామంలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంతకు వేలంపాట నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15న ఉదయం 11.00 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో సంత వేలం ఉంటుందన్నారు. సంత వేలం పొందిన వారు 1 జూలై 2024 నుండి 31 మార్చి 2025 వరకు 9 నెలల గడువు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

19న పోనకల్ దిన, వారసంత

ఈ నెల 19న పోనకల్ దిన, వారసంతల వేలం పాట ఉంటుందని ప్రత్యేక అధికా రమేష్, కార్యదర్శి రాహుల్ లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి రోజు జరిగే దిన సంత, అదేవిధంగా ప్రతి మంగళవారం జరిగే వారసంతలకు ఈ నెల19న గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఈ వేలంపాటలో పాల్గొనే వారు ఉదయం 9 గంటల నుండి 12 గంటల లోపు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

పిల్లల వికాసానికి బ్రైటర్ మైండ్స్ వేసవి శిబిరం

- అదనపు కలెక్టర్ బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

పిల్లలు ఎలాంటి భావోద్వేగాలకు లోను కాకుండా భౌతిక, మానసిక వికాసానికి శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా బ్రైటర్ మైండ్స్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. నస్పూర్‌లో నిర్వహించిన బ్రైటర్ మైండ్స్ వేసవి శిబిరానికి హాజరై పిల్లలకు ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలోని వివిధ రకాల మాధ్యమాలు, పరికరాలతో మనుషుల ఆలోచన శక్తి క్షీణిస్తుందని, చిన్నతనం నుండి పిల్లల మెదడుపై ఒత్తిడిని తగ్గిస్తూ వారు భావోద్వేగాలకు లోను కాకుండా విద్య, పోషకాహారం, భౌతిక, మానసిక వ్యాయామం, మంచి నిద్ర, ఆధ్యాత్మికమైన ప్రశాంత వాతావరణంలో పెరిగేలా కృషి చేయాలన్నారు. బ్రైటర్ మైండ్స్ శిబిరంలో మెదడుకు వ్యాయామం, ప్రాణాయామం, యోగ, ముద్ర, జ్ఞాపకశక్తి, వినోద ఆటలు, చిత్రలేఖనం, మెదడుకు సంబంధిత ఆటలు ఆడించి పిల్లలను చైతన్యవంతులను చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ డా.వెంకటేష్ పాలకుల, జోనల్ కో-ఆర్డినేటర్ సతీష్ జంజిరాల పాల్గొన్నారు.

వర్షాకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జైపూర్

వర్షాకాల వ్యాధులపై పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం భీమారం మండలంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పోంలపల్లి గ్రామ పంచాయతీ పరిధి అంకుషాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మద్దికల్ గ్రామ పంచాయతీ పరిధిలో పర్యటించిన ఆయన నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా మిషన్ భగీరథ సర్వే యాప్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అదనపు కలెక్టర్‌తో పాటు ఎంపీడీఓ రాధ రాథోడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులున్నారు.

యాసంగి వరి ధాన్యం డబ్బులు చెల్లించాలి



నవతెలంగాణ-జన్నారం

రైతుల ఖాతాల్లో యాసంగి వరి ధాన్యం డబ్బులు జమ చేయాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు దుర్గయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కొండగుర్ల లింగన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు సంఘ భవనంలో మీడియాతో మాట్లాడారు. యాసంగి వరి ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు మాత్రం రాలేదన్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఇబ్బందులకు తప్పడం లేదన్నారు. ఒకపక్క వర్షాకాలం పంటలు ప్రారంభమవుతున్న దశలో డబ్బులు లేక రైతులు పనులు ప్రారంభించ లేదని తెలిపారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను మోసం చేస్తుందన్నారు. ఎరువుల, విత్తనాల దుకాణాల ముందు చెప్పులు లైన్‌లో పెట్టి విత్తనాలు ఎరువులు కొనుక్కునే పరిస్థితులు దాపరించాయన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే యాసంగి వరి ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు

నవతెలంగాణ-తాండూర్

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్ అన్నారు. తాళ్ళగురిజాల ఎస్ఐ నరేష్ నిర్వహించిన డ్రంక్అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి గురువారం తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ అనంతరం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వాహనదారులను బెల్లంపల్లి మేజిస్ట్రేట్ వద్దకు తీసుకెళ్లారు. ఐదుగురికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేరాలు అదుపుకు ప్రత్యేక చర్యలు

- పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



నవతెలంగాణ-నస్పూర్

నేరాలను అదుపుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీరిలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది వివరాలు, పనితీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ కేసుకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని జాప్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. బాధితులకు పోలీసులు అండగా ఉంటూ సత్యం నమ్మకం, భరోసా కలిగించే విధంగా ప్రవర్తించాలన్నారు. పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ తమతమ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో సాధారణ విధులపై దృష్టి పెట్టడంలో భాగంగా పోలీస్ స్టేషన్లను విజిట్ చేసి శాంతిభద్రల సమస్యలపై, పెండింగ్‌లో ఉన్న కేసులో వివరాలు తెలుసుకుని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జులై 1 నుంచి కొత్త చట్టాలు అమలవుతున్న నేపథ్యంలో పలు కేసులు దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో విసబుల్ పోలింగ్ నిర్వహించాలని, బీట్లు, పెట్రోలింగ్ పగడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, శ్రీరాంపూర్ ఎస్సైలు సంతోష్, ప్రసన్న పాల్గొన్నారు.

ఆశాలకు పరీక్ష పెట్టె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

నవతెలంగాణ-నస్పూర్

ఆశాలకు పరీక్ష పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆశా యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఎంహెచ్ఓ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు ఏండ్లుగా ప్రభుత్వ నిర్వహించిన శిక్షణాలు, ఆన్‌లైన్, దీర్ఘకాలిక వ్యాధులు అన్నిరకాల జబ్బులను గుర్తిస్తున్నామన్నారు. తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తున్నామని, వీటితో పాటు బాలింతలు, చిన్న పిల్లలకు, ఇతర ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నామన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రణలో కీలకంగా ఉన్నామన్నారు. సీనియారిటీ ఉన్న వర్కర్లకు మళ్ళీ కొత్తగా పరీక్ష నిర్వహించి కొత్తగా ఆశాల జ్ఞాపకశక్తిని నిరూపించుకోవాలని చెప్పడం సరికాదన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆశాలకు సమస్యలు తేవడం న్యాయం కాదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆశాల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఆ తర్వాత ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా జిల్లా కమిటీ సభ్యులు రాణి, పుష్ప, భాగ్య, గంగుబాయి, కవిత, స్రవంతి, పద్మ, నీరజ, సువర్ణ, సీఐటీయూ జిల్లా నాయకులు ఏ.లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచుతాం..

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ
- ఎరువుల దుకాణాల తనిఖీ



నవతెలంగాణ-వేమనపల్లి

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులను దుకాణాల్లో అందుబాటులో ఉంచేల చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ అన్నారు. ఎరువుల కొరత ఉందని బుధవారం మండల కేంద్రంలో రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ గురువారం మండల కేంద్రంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు వానకాలానికి సరిపడా ఎరువులు అందుబాటులో లేవని తెలిపారు. రైతులకు అవసరానికి 80 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ ఎరువులు పంపిస్తామని హామీ ఇచ్చారు. తనిఖీలో భాగంగా వినాయక ఫెర్టిలైజర్, అయ్యప్ప ట్రేడర్స్, ప్రణీత ట్రేడర్స్, సప్తగిరి ఫెర్టిలైజర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ మాట్లాడుతూ దుకాణదారులు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నప్పుడు రైతులకు ఒరిజినల్ రసీదును ఇవ్వాలని, ప్రభుత్వం అనుమతించిన విత్తనాలనే అమ్మాలని సూచించారు. స్టాక్ బోర్డు పై వివరాలను ఎప్పటికప్పుడు రాయలన్నారు. బిల్ బుక్కులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎరువుల గోదాంలకు వెళ్లి అక్కడున్న ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లో ఉన్నా వాటిని సరిచూశారు. ఆమె వెంట ఏఈఓ రుక్సర్ సుల్తానా, రైతులున్నారు.

ఈపీ ఆపరేటర్ ట్రైనీ ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకం

- జీఎం సంజీవరెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

అంతర్గత ఈపీ ఆపరేటర్ ట్రైనీ ప్రాక్టికల్ పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఈనెల 18 నుంచి ప్రగతి మైదానంలో నిర్వహించే అంతర్గత ఈపి ఆపరేటర్ ట్రైనీ పోస్టుల భర్తీకి నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన సన్నాహ ఏర్పాట్లపై ఏరియా అధికారులతో జీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో ఈనెల 18 నుండి 21 వరకు ప్రాక్టికల్ పరీక్ష జరుగుతుందని, దీన్ని పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో ప్రగతి మైదానంలో హాజరు కావాలని, బయటి వ్యక్తుల ప్రలోభాలకులోను కాకుండా ఉండాలని సూచించారు. ప్రగతి మైదానంలో పరీక్షకు కావాల్సిన ఏర్పాట్లను సంబంధిత విభాగాల అధికారులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు, ఏరియా వర్క్ షాప్ డీజీఎం రవీందర్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, ఇన్‌చార్జీ సివిల్ డీజీఎం రాము, ఐఈడీ ఎస్ఈ కిరణ్ కుమార్, డీవైపీఎం దేవేందర్ రెడ్డి, సీనియర్ పీఓపీ కాంతారావు, ఆటో వర్క్ షాప్ ఇంజనీర్ రవి పాల్గొన్నారు.

మందమర్రి : ఈపీ ఆపరేటర్ ట్రైని సెలక్షన్‌కు జీఎం మనోహర్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో గురువారం కమిటీ సమావేశం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ మందమర్రి బెల్లంపల్లి ఏరియాలలో 187మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 18,19 తేదీలలో సెలక్షన్ ఉంటుందని తెలిపారు. సింగరేణి హై స్కూల్ మైదానంలో ఉదయం 6గంటల నుండి సెలక్షన్స్ ఉంటాయన్నారు. వ్యాయామం, క్రీడలకు వచ్చే వారికి 16 నుండి 19 వరకు గ్రౌండ్‌లోకి అనుమతి ఉండదన్నారు. కార్యక్రమంలో ఐఈడీ(డీజీఎం) రాజన్న, డీజీఎం(సివిల్) శ్రీనివాసులు, కెకె ఓసీపీ ఇంజనీర్ రాజు, ఎస్ఈ వర్క్‌షాప్ నాగరాజు నాయక్, డివైపిఎం మైత్రేయ బంధు, సత్యబోస్, ఎస్ఎస్ఓ(ఎస్అండ్‌పీసీ) రవి పాల్గొన్నారు.

సేఫ్టీ కమిటీలు లేకనే కార్మికులకు సమస్యలు



నవతెలంగాణ-నస్పూర్

సేఫ్టీ కమిటీలు లేకనే కార్మిక సమస్యలు పేరుకుపోతున్నాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ అన్నారు. గురువారం ఎస్ఆర్పీ1 గనిలో ఫిట్స్ సెక్రటరీ సుధాకర్ ఆధ్వర్యంలో కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల అధికారికంగా సేఫ్టీ కమిటీలను యాజమాన్యం నడిపించకుండా తమకు అనుకూలంగా ఉన్న వారితో తూతూ మంత్రంగా నడిపిస్తుందని ఆరోపించారు. దీంతో గనిలో కార్మిక సమస్యలు పేరుకుపోతున్నాయని విమర్శించారు. కొంత మంది సూపర్‌వైజర్లు కార్మికులు తమకు అనుకూలంగా ఉండటం లేదని ఇబ్బందులు పెట్టే పద్ధతులు మానుకోవాలన్నారు. ముఖ్యంగా గనిలో పనిముట్ల కొరత, వెంటిలేషన్ పని ఒత్తిడి వంటి వాటితో కార్మికులు ఇబ్బంది పడుతుంటే గెలిచినా కూడా గుర్తింపు పత్రం తీసుకోకుండా నాలుగు సంవత్సరాలు కావాలని పట్టుబట్టి కార్మిక సమస్యలను పట్టించుకోకుండా ఉండడం సరైనది కాదని అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జీఎం ఆఫీసుల ముందు ఒక్కరోజు దీక్ష చేసి ఒత్తిడి చేయడం వల్ల రెండు రోజులు ఆర్ఎల్సీ వద్ద చర్చలు జరిపి తొమ్మిది డిమాండ్లను అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందన్నారు. అందులో పెండింగ్‌లో ఉన్న వయసు పెంపు, మారు పేర్లు వంటి వాటిపై అన్ని యూనియన్లు వినతిపత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్గనైజర్ శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

మంచి విద్య బోధనతోనే పాఠశాలకు గుర్తింపు



నవతెలంగాణ-జన్నారం

మంచి విద్యా బోధనతోనే పాఠశాలకు మంచి గుర్తింపు లభిస్తుందని జన్నారం, ఉట్నూర్ జడ్పీటీసీలు ఎర్ర చంద్రశేఖర్, చారులతా రాథోడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు ముత్యంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యాస ప్రయివేట్ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రయివేట్ పాఠశాల ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమన్యం వినోద్ నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్, శంకరయ్య, ప్రభు దాస్, కాసెట్టి లక్ష్మణ్, మోహన్ రెడ్డి, ఫసిఉల్లా పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్ అన్నారు. పట్టణంలోని అమరవాది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నంది వెంకటస్వామి ఇటీవల పాముకాటుకు గురై మరణించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కంభగోని సుదర్శన్ గౌడ్ స్థానిక 5వ వార్డు కౌన్సిలర్ జిలకర మహేష్ గురువారం మృతుడి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల పార్టీ బీమా చెక్కును అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, చెన్నూర్ మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ ప్రత్యేక చొరవ చూపి రూ.రెండు లక్షల చెక్కు త్వరితగతిన అందించేలా కృషి చేశారన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తలకు అండగా నిలుస్తుందని, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాడి శ్రీనివాస్, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీఎస్ఆర్‌కు మంత్రి పదవి రావాలని పూజలు

నవతెలంగాణ-నస్పూర్



మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు(పీఎస్ఆర్)కు మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ 22వ వార్డు ఇన్‌చార్జి పడాల సంజీవ్ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో గురువారం పూజాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల సంజీవ్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేల గెలుపు కోసం కృషి చేశారని, ఇంద్రవెల్లి సభ విజయవంతంలో కీలకంగా ఉన్నారన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రేమ్ సాగర్ రావుకు మంత్రి పదవి వస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గట్టు శ్రీనివాస్ గౌడ్, పప్పు శ్రీనివాస్, కోసారి శ్రీనివాస్, కురుమిళ్ళ పోశం, అన్నం వెంకటేశ్వర్లు, అన్నం చంద్రం, రాజు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పనుల పరిశీలన

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని నగర్, పిప్పిరి, గడ్‌చాంద, పంచగుడి గ్రామాల్లో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వేను గురువారం ఎంపీడీఓ సోలమన్‌రాజ్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీల రికార్డులు, అమ్మఆదర్శ పాఠశాల పనులు, అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీ నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్, పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. వాటి నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

అడవి పంది దాడిలో రైతుకు గాయాలు

నవతెలంగాణ-బోథ్



మండలంలోని సాకెర గ్రామానికి చెందిన రాథోడ్ బద్దుపై గురువారం అడవి పంది దాడి చేసింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం... తన చేనులో పని చేస్తుండగా ఒకేసారి వెనుక భాగం నుంచి వచ్చి అడవి పంది దాడి చేసింది. దాడిలో కాళ్లకు, చేతికి, చాతిపై తీవ్ర గాయం అయిందని తెలిపారు. కుటుంబ సభ్యుల బాధితుడిని బోథ్ ఏరియా ఆస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్టు తెలిపారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమ నిర్వహణకు తీసుకోవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు. 1-19 వయస్సు గల పిల్లలు జిల్లాలో 1,92,000 మంది ఉన్నారని, ప్రతి ఒక్కరికి నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలని సూచించారు. నులిపురుగుల వలన పిల్లలలో కలిగే నష్టాలు, మాత్రలను వేసుకోవడం వలన కలిగే లాభాలను పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, కళాశాలలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. విద్య, వైద్య, పంచాయతీ, శిశు సంక్షేమం, డిఆర్డిఓ శాఖల సమన్వయంతో నులి పురుగుల నియంత్రణకు వందశాతం పిల్లలకు మాత్రలను అందించాలని సూచించారు. సమావేశంలో డిఎంహెచ్ ధన్‌రాజ్, జడ్పి సీఈఓ గోవింద్, డిపిఓ శ్రీనివాస్, డిఈఓ రవీందర్ రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిడబ్ల్యూఓ నాగమణి పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏఓగా ప్రేమ్ కుమార్

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి వ్యవసాయ శాఖ అధికారిగా సుద్దాల ప్రేమ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో బెల్లంపల్లి ఏఓగా పని చేసిన ప్రేమ్ కుమార్ డిప్యూటేషన్‌పై కొనేండ్లు నెన్నెల మండలంలో పనిచేశారు. ప్రభుత్వం డిప్యూటేషన్లు రద్దు చేయడంతో తిరిగి బెల్లంపల్లి వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి దుర్గం అర్జున్‌ను జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చారు. గురువారం కళాశాల ప్రిన్సిపల్ సంపత్, అధ్యాపక బృందం విద్యార్థుడిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సంపత్ మాట్లాడారు. జేఈ మెయిన్స్‌లో 1782 ర్యాంకు సాధించి, ప్రభుత్వ కళాశాల ప్రతిభను జిల్లావ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చాడని అన్నారు. ప్రయివేటు జూనియర్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల చక్కటి ప్రణాళికతో అనుభవం, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం బోధన చేస్తోందని అన్నారు. కళాశాలలో ప్రత్యేకమైన తరగతులు తీసుకుంటూ విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామని అన్నారు. కళాశాలలో ఫర్నీచర్‌ను సమకూర్చుతూ, విద్యార్థులను ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దడానికి ప్రణాళిక బద్ధంగా బోధన చేస్తున్నామని అన్నారు. వాంకిడి జూనియర్ కళాశాల జిల్లాలోనే ఇతర జూనియర్ కళాశాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అర్జున్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అర్జున్ ఆర్థిక పరిస్థితి సరిగా లేని కారణంగా అతని పైచదువులకు తమవంతు ఆర్థిక సాయం అందిస్తామని ప్రిన్సిపల్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండలం వడ్కాపూర్, కాచాపూర్ గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో వాడకాపూర్ గ్రామంలో ఓ ఇంటిలో రేకులు లేచిపోయి కరెంటు పోల్ స్తంభానికి చిక్కుకున్నాయి. దీంతో కరెంటుకి తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షం పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డీజిల్ దందాపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం కార్పొరేషన్ అవినీతికి పరాకాష్టగా మారిందని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ఆరోపించారు. దీనికి నిదర్శనంగా గురువారం ఓ సంఘటన చోటు చేసుకుందని తెలిపారు. గత కొద్దిరోజులుగా రామగుండం కార్పొరేషన్‌లో డీజిల్ దందా బాగోతంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అందుకు నిదర్శనంగా గోదావరి డంపింగ్ యార్డ్ వద్ద పెట్రోల్ లేక వాహనం నిలిచిపోయిందని తెలిపారు. పారిశుధ్య వాహనాలలో డీజిల్ తక్కువ పోస్తూ... రికార్డుల్లో ఎక్కువ రాస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్న సదరు సెక్షన్ అధికారి వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజిల్ దందాపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-మంథని

మంథని పట్టణంలోని సర్వే నెంబర్ 13లో గౌడ్స్, పద్మశాలి కుటుంబాలకు ఇచ్చిన ప్లాట్లను ఎంక్వైరీ చేయాలని కోరుతూ మంథని మున్సిపల్ కమిషనర్ గుట్ట మల్లికార్జున స్వామికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు డిగంబర్‌కు వినతిపత్రం సమర్పించారు. కొందరు పట్టాలు లేనివారు ఆ స్థలంలో అక్రమంగా షెడ్డులు వేసుకున్నవాటిని తొలగించాలని ఆయన కోరారు.





పశుగ్రాసం లేక.. ఆకలి తీరక

మొన్నటి వరకు వేసవి కాలం.. నిన్నటి నుంచి వర్షాకాలం కానీ మేఘాలు ఉరమలే.. వర్షం కురవలే... గడ్డి మొలవలే.. దీంతో పశువులకు తినడానికి తిండి, తాగడానికి నీళ్లలేక అల్లాడిపోయాయి. వాటి బాధ చూడలేని రైతులు వరి గడ్డిని కొనుగోలు చేసి తీసుకెళ్లి ఆకలి తీరుస్తున్నారు. కనీసం తాగడానికి చాలా గ్రామాల్లో నీళ్ల లేకపోవడంతో అక్కడక్కడ నిర్మించిన నీటి తొట్టెల వద్దకు వెళ్లి దాహం తీర్చుకుంటున్నాయి. పశుగ్రాసం లేక నీళ్ల దొరకక మూగజీవాలు పడుతున్న బాధలు తెలిపే చిత్రమాలిక ఇది..

-నవతెలంగాణ-దహెగాం





ప్రయివేటు పనులకు పంచాయతీ ట్రాక్టర్

నవతెలంగాణ-నేరడిగొండ



పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్యేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. పంచాయతీ అవసరాలను వాడుకోవటంతో పాటు చెత్త సేకరణకు ఉపయోగించుకోవడం, మొక్కలను నీటిని పట్టడం లాంటి పనులకు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగిస్తుంది. అదేవిధంగా ట్రాక్టర్ ఏయే పనులకు వినియోగిస్తున్నారు. డీజిల్ ఖర్చులు తదితర వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాని మండలంలోని కుంటాల(బి) గ్రామపంచాయతీ ట్రాక్టర్ అధికారులకు తెలియకుండానే ఓ కాంట్రాక్టర్ తన సొంతానికి ట్రాక్టర్‌ను వాడుకుంటున్నారని గ్రామస్తులు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా తనకు తెలియదన్నారు. అధికారులకు తెలియకుండానే ట్రాక్టర్‌ను కాంట్రాక్టర్ వాడుకుంటున్నారా..! తెలిసి వాడుకుంటున్నారా..! అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా సొంత పనులకు పంచాయతీ పనులకు వాడటం అంటే ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టేనని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

ఎంపీఓ లక్ష్మణ్, నేరడిగొండ

గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను ప్రయివేట్ పనులకు ఉపయోగించరాదు. అలా ఉపయోగించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, పంచాయతీ, నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూములను, ఆక్రమిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్రమ లే అవుట్‌లపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ శాఖల అధికారులకు సూచించారు. నూతన లే అవుట్ అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూముల ఆక్రమణలను గుర్తించడం జరిగిందని తెలిపారు. బాధ్యులకు నోటీసులు జారీ చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనీ ఆదేశించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, జిల్లా పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఉట్నూర్



కల్తీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని హస్నాపూర్, చాందూరి, ఉట్నూర్, గ్రామాల్లోని విత్తన, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు మోసం చేస్తే దుకాణాలను సీజ్ చేస్తామని అన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అమ్మాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు తప్పని సరిగా రశీదులు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా యజమానులు విత్తన, ఎరువుల స్టాక్‌లను బోర్డుపై నమోదు చేసి ఉంచాలని తెలియజేశారు. ఈ తనిఖీల్లో ఉట్నూర్ ఏఓ రాథోడ్ గణేష్, రైతులు ఉన్నారు.

సింగరేణిలో ఇంటి రుణంపై వడ్డీ చెంపు ఆంక్షలు లేవు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కార్మికులకు యాజమాన్యం తీపి కబురు అందించింది. ఇంటి రుణాలపై గతంలో ఉన్న ఆంక్షలను ఎత్తివేతకు అంగీకరించింది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గతంలో బ్యాంకుల నుండి ఇంటి నిర్మాణం కోసం రుణం తీసుకున్నా, ఇంటిని కొనుగోలు చేసుకున్నా, సంవత్సరంలోపు వారికి సింగరేణి యాజమాన్యం వడ్డీ చెల్లించేది. ఫలితంగా సంవత్సరం దాటిన చాలా మంది కార్మికులకు యాజమాన్యం వడ్డీ చెల్లించేది కాదు. అంతే కాకుండా 8.33 శాతం కంటే తక్కువ వడ్డీకి తీసుకున్న బ్యాంకు రుణాలకు మాత్రమే 6 లేదా 7 శాతం వడ్డీ చెల్లించిన తీరుపై ఏఐటీయూసీ సింగరేణి డైరెక్టర్ ఫా అండ్ ఫైనాన్స్ జీఎంతో జరిపిన సంప్రదింపులతో వడ్డీ చెల్లింపు సర్క్యులర్ సవరించినట్లు తెలిపారు. సవరించిన సర్క్యులర్ ప్రకారం ఇల్లు కట్టుకున్నా, కొనుకున్నా ఎప్పుడైనా బ్యాంకు రుణం తీసుకుంటే వారికి కూడా వడ్డీ చెల్లిందేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా తక్కువ వడ్డీతో రుణం తీసుకున్నా కూడా 8.33 శాతం వడ్డీ చెల్లించేందుకు అంగీరిస్తూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళను దారుణంగా హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఖుర్షిద్‌నగర్‌లో సంఘటన స్థలానికి వెళ్లి మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలిని వెంటనే గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని, నిందితులను త్వరగా గుర్తించి శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి లంక జమున స్పష్టం చేశారు. ఐద్వా నాయకులు కోవ శకుంతల, ఆర్.మంజుల, కె.లలిత తదితరులున్నారు.

15 నుంచి వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-తాండూర్

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈనెల 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు తాండూర్ సర్కిల్ పరిధిలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఐ కుమార స్వామి తెలిపారు. ఈ క్రీడల్లో తాండూర్, భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు పాల్గొనవచ్చునని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే టీంలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఆయా స్టేషన్ల ఎస్సైలను సంప్రదించాలని సూచించారు.


ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు శివప్రియ ఎంపిక

నవతెలంగాణ-తాంసి



నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్‌కు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి చదువుతున్న శివప్రియ ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ తెలిపారు ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున బాలిక అకౌంట్‌లో ఐదు సంవత్సరాల వరకు స్కాలర్షిప్ వస్తుందని అన్నారు. విద్యార్థిని పాఠశాల సిబ్బంది అభినందించారు. అదేవిధంగా భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నీలగిరి నరేందర్, షేక్ జాస్మిన్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసు





నవతెలంగాణ-మందమర్రి

పరిమితికి మించి ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై మందమర్రి పోలీసులు యానిమల్ క్రూయాల్టీ యాక్ట్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌటాల నుంచి హైదరాబాద్‌కి పరిమితికి మించి ఎద్దులను తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో గురువారం రాత్రి మందమర్రి టోల్గేట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు డీసీఎం వాహనాలలో పరిమితికి మించి ఎద్దులు ఉన్నట్టు గుర్తించారు. బహదూర్‌పూర్ హైదరాబాద్‌కు చెందిన డ్రైవర్లు ఎండీ హైమద్, సయ్యద్ అలీమ్, సహాయకుడు మీర్జా జావేద్ లక్ష్మీనగర్, వాంకిడి, సప్లై దారుడు సాధిక్ వాంకిడి వీరందరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

50 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని మార్కండేయ కాలనీలోని రాజలక్ష్మి గార్డెన్స్‌లో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువారం జరిగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974-75 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమ గురువులు గోవర్ధన్, రాజ కొమురయ్యలను ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుద్ధ వనం ప్రాజెక్ట్ మాజీ స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, పులి మోహన్, బాలకృష్ణ, పెండెం సారయ్య, ఆకుల శంకర్, మాజీ డీఎస్పీ రవీందర్, ప్రముఖ న్యాయవాది బల్మూరి అమరేందర్ రావు, చంద్రశేఖర్, మాజీ మేయర్ జాలి రాజమణి, బీమ్ సేన్, కుమార స్వామి, రాజ్‌కుమార్, నారాయణ, సాంబయ్య,కనకయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా చంద్రపాల్, చిలుముల శంకర్, మేజిక్ రాజా ప్రదర్శించిన హాస్యవల్లరి, గేయాలు అందరినీ అలరించాయి.